మార్కండేయ స్వామికి ఘనంగా పూజలు



శామీర్‌పేట్: శివభక్త మార్కండేయ స్వామికి శామీర్‌పేటలో శనివారం ఘనంగా పూజలు నిర్వహించారు. శామీర్‌పేట పెద్ద చెరువు ప్రాంతంలో ఉన్న మార్కండేయ దేవాలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహాధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కీసర: సంక్షేమ పథకాలు ప్రైవేటు బీమా కంపెనీలకు ఇవ్వొద్దని, వృద్ధాప్య కార్మికులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మేడ్చల్– మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు మొరుగు యాదగిరి అన్నారు. 3వ తేదీన చలో హైదరాబాద్ పేరిట నిర్వహించనున్న మహాధర్నా విజయవంతం చేయాలని కోరుతూ కీసరలో శనివారం వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు ఎ.ముత్యాలు, నాయకులు శ్రీరాములు, గణేష్, భిక్షపతి, లాజర్, చంద్రయ్య పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ అందజేసిన ఐడీబీఐ బ్యాంకు



మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి ప్రభుత్వ పాఠశాలకు మేడ్చల్ ఐడీబీఐ బ్యాంకు వారు తమ సీఎస్‌ఆర్ నిధులతో ప్రింటర్ అందజేశారు. అత్వెల్లి పాఠశాల విద్యార్థుల కోసం ఆల్‌ఇన్ వన్ ప్రింటర్ అందజేసినట్లు బ్యాంకు ప్రతినిధులు తెలిపారు. బ్యాంకు అధికారులు సంతోష్‌రెడ్డి, గౌతమి, మోసిన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని నాచారం ఫైర్ విక్టమ్ కాలనీలో దళిత సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ట్రినిటీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 100మందికిపైగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. దళిత సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో ట్రినిటీ ఆస్పత్రి డాక్టర్ అఖిల్, కార్తీక్, నాయకులు నగేష్, పరమేష్, నరేందర్, శ్రీనివాస్, సావిత్రి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రజాప్రతినిధులకు సన్మాన సభ



ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో పదవులు ముగిసిన రెడ్డి సంఘం మాజీ ప్రజాప్రతినిధులను పట్టణంలోని రెడ్డి సంఘం కార్యాలయంలో ఆ సంఘం అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన శనివారం సత్కరించారు. మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, మాజీ కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, సంగీత, అనురాధ, హేమలత, కో ఆప్షన్ మాజీ సభ్యుడు సురేందర్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్ ధర్మారెడ్డి, మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, గోపాల్‌రెడ్డి, అంజిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సాయిరాంరెడ్డి పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నపై కేసు

కీసర: రెడ్డి కులస్తులపై అనుచిత వాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ నవీన్(తీన్మార్ మల్లన్న)పై కీసర పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌కు రెడ్డి సంఘం నాయకులు శనివారం ఫిర్యాదు చేశారు. నాయకులు సతీష్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ రెడ్డిలు తెలంగాణ వాసులే కాదనడం ఘోరమన్నారు. తీన్మార్ మల్లన్న రెడ్డిల చరిత్ర తెలుసుకొని మాట్లాడాలన్నారు. త్వరలో తీన్మార్ మల్లన్నకు రెడ్డి అనే పదానికి అర్థం తెలిసి వస్తుందన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుపతిరెడ్డి, జంగారెడ్డి, సురేందర్‌రెడ్డి, శేఖరెడ్డి, వినయ్‌రెడ్డి ఉన్నారు.

అభివృద్ధి శూన్యం.. పేదలే సాక్ష్యం

జవహర్‌నగర్‌లో పాలకవర్గ పదవీ కాలం ముగిసింది. ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. జవహర్‌నగర్ ప్రత్యేక అధికారిగా సంధ్యకు ప్రభుత్వం బాధ్యతలను అప్పగించింది. ఆరు రోజుల క్రితం ఆమె బాధ్యతలు చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న పనులు, అడుగడుగునా సమస్యలను పరిష్కరించేందుకు నిధులు లేక కొట్టుమిట్టాడుతున్న మున్సిపల్‌లో సమన్వయం చేసే బాధ్యత ఆమె చేపట్టింది. సమస్యలను ఎలా పరిష్కరిస్తారనేదే సవాల్‌గా మారింది. మరోవైపు సవాలక్ష రాజకీయాలతో ఐదేళ్లు తమ సమస్యలను ఎవరూ పట్టించుకోలేదని, స్పెషల్ ఆఫీసర్ అయినా పరిష్కరించాలని ప్రజలు కోరుకుంటున్నారు. - జవహర్‌నగర్

- ఆహ్లాదం.. అడ్రస్ గల్లంతు
- అస్తవ్యస్తంగా అంతర్గత రోడ్లు
- 58, 59 జీవో.. గరీబ్‌కో దేఖో..
- మొదలైన ప్రత్యేక పాలన
- సమస్యలు పరిష్కరించాలని వేడుకోలు



జవహర్‌నగర్ వ్యూ

జవహర్‌నగర్.. ఈ పేరు తెలియని వారు దాదాపు గ్రేటర్‌లో ఉండరు. ఇంచుమించు మూడు లక్షల జనాభాతో ఈ ప్రాంతం కిటకిటలాడుతోంది. ఇక్కడ నివసించే వారిలో అధిక శాతం పేదలే.. ఈ ప్రాంతంలో నివాసం ఉంటూ.. నిత్యం వివిధ ప్రాంతాలకు ఉపాధి కోసం వెళ్లి తిరిగి వస్తుంటారు. అలాంటి జవహర్‌నగర్‌లో సమస్యలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయి. దీంతో వారు సతమతం అవుతున్నారు. వార్డు స్థాయి నుంచి కార్పొరేషన్‌గా ఎదిగి గ్రేటర్‌లో విలీనమైనా ప్రజల జీవనస్థితిలో ఎలాంటి మార్పులేదు. అభివృద్ధికి ఆమడ దూరంలో కొట్టుమిట్టాడుతోంది. ఇదిగో.. అదిగో అంటూ హామీల వర్షం కురిపించి ఆ తర్వాత పేదలవైపు కన్నెత్తి చూడని ప్రజాప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గెలిస్తే మెరిపిస్తామన్నారు. కనిపించలేదని విమర్శిస్తున్నారు.

ఆహ్లాదం.. అడ్రస్ ఎక్కడ?

దాదాపు 100 కాలనీలు ఉన్న ప్రాంతంలో ఆహ్లాదం కనుమరుగైంది. అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. ఏ కాలనీకి వెళ్లినా అడుగుతీసి అడుగేయలేని పరిస్థితి. పేరుకే ప్రధాన రహదారి పక్కన అక్కడక్కడా డ్రైనేజీ, సీసీ రోడ్లు వేసి మమ అనిపించుకున్నారు. చిన్నారులకు ఆట విడుపు కరువైంది. సంక్షేమ గురుకులాల కోసం స్థలం కేటాయించినా వాటిని అమలు చేయకుండా కాలం వెళ్లదీస్తున్నారు.

కాలుష్యానికి కేరాఫ్..

ఈ ప్రాంత ప్రజలకు అతిపెద్ద సమస్య డంపింగ్ యార్డ్.. జల, వాయు కాలుష్యంతో సమీప ప్రాంతాల్లోని దాదాపు 10 లక్షల మంది నరకం అనుభవిస్తున్నారు. చెరువులు, కుంటలు, బోరు బావులు కలుషితమయ్యాయి. అంతేకాకుండా పవర్‌ప్లాంట్‌ను సైతం ఏర్పాటు చేయడంతో శబ్ధ కాలుష్యంతో కంటిమీద కునుకు కరువైంది.

బహిరంగంగానే.. వర్గపోరు

జవహర్‌నగర్‌లో వర్గపోరు బహిరంగంగానే కనిపిస్తోంది. కార్పొరేషన్‌లో పాలకమండలి సభ్యులు వర్గపోరుతో అభివృద్ధికి ఆటంకం కలిగించారు. కేవలం సొంత ప్రయోజనాల కోసమే తప్ప ప్రాంత అభివృద్ధికి కృషి చేసిన దాఖలాలు లేకుండా పోయాయి.



జవహర్‌నగర్‌లో ఇళ్ల పక్కన నాలాల దుస్థితి

అంతర్గత రోడ్లు.. అస్తవ్యస్తం..

జవహర్‌నగర్‌లోని 100 కాలనీల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఇంకా చీకట్లోనే కొన్ని కాలనీలు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. రోడ్ల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. కేవలం ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న రోడ్లు, ప్రజాప్రతినిధులకు సంబంధించిన రోడ్లు మాత్రమే ఏర్పాటు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఇంకా కొన్ని ప్రాంతాలకు సరైన రోడ్లు లేక వెళ్లలేని దుస్థితి ఉంది.

58, 59 జీవో.. గరీబ్‌కో దేఖో..

ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదల ఇళ్లను క్రమబద్ధీకరించేందుకు గత ప్రభుత్వం జీవో 58, 59ను తీసుకువచ్చింది. జవహర్‌నగర్‌లో దాదాపు వెయ్యి ఎకరాల్లో దాదాపు 60వేల ఇళ్లలో ప్రజలు నివాసం ఉంటున్నారు. ప్రభుత్వం కేవలం 338 ఎకరాలను మాత్రమే గ్రామకంఠంగా ఏర్పాటు చేసింది. మిగిలిన కాలనీలను ఇప్పటి వరకు గ్రామకంఠంగా గుర్తించకపోగా జీవో 58, 59ను సైతం అమలు చేయకుండా ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది.

సమస్యల పరిష్కారానికి కృషి

జవహర్‌నగర్ పరిధిలో ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా. ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సంక్షేమ పథకాలను ప్రజలు అందేలా చర్యలు తీసుకుంటాం. రాష్ట్రంలో ఎక్కడా లేని సమస్య ఇక్కడే ఉంది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం అడుగులు వేస్తాం. జవహర్‌నగర్ అభివృద్ధికి అందరూ సహకరించాల్సిన అవసరం ఉంది.

– సంధ్య, జవహర్‌నగర్ ప్రత్యేక అధికారి

ఘనంగా గాయత్రీ మాత ఆలయ వార్షికోత్సవం

పోచారం: అన్నోజిగూడలోని గాయత్రీ మాత ఆలయం 19వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో కొలువుదీరిన గాయత్రీ మాతకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మను ధ్యానిస్తే అంతా మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున వచ్చిన భక్తులు వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. సకల వేద స్వరూపమైన గాయత్రీ దేవిని భక్తులు దర్శించుకొని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మహిళా అధ్యక్షురాలిగా ఈగ శ్వేత



కీసర: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం మహిళా కాంగ్రెస్ విభాగం నేతలు కృషి చేయాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు అన్నారు. దమ్మాయిగూడ మున్సిపల్ ఆర్‌జీకే కాలనీకి చెందిన ఈగ శ్వేతకు మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలుగా శనివారం నియామకపత్రం అందజేశారు.

జవహర్‌నగర్ పోలీసుల వద్ద బాలుడు



బాలుడు శామ్యుల్

జవహర్‌నగర్: దమ్మాయిగూడలో ఒంటరిగా ఉన్న ఓ బాలుడిని గుర్తించి జవహర్‌నగర్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామ్యుల్(3) దమ్మాయిగూడలో అదృశ్యమయ్యాడు. అతడి తల్లి పార్వతి అని చెప్పాడు. బాలుడి కోసం జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

మృతుడు అజయ్ కుటుంబానికి ఆర్థిక సాయం



కీసర: నగరంలోని హుస్సేన్‌సాగర్‌లో గతనెల 26వ తేదీ రాత్రి జరిగిన బోటు ప్రమాదంలో మృతి చెందిన నాగారం మున్సిపాలిటీకి చెందిన శేలివేరు అజయ్(20) కుటుంబసభ్యులకు రూ.20 లక్షల ఆర్థిక సాయం శుక్రవారం భరతమాత ఫౌండేషన్ సంస్థ వారు అందజేశారు. అజయ్ కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగానే ఉన్నాయని, వారిని ఆదుకోవాలని బీజేపీ మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి, నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి భరతమాత ఫౌండేషన్‌ను కోరారు. ఈ మేరకు ఫౌండేషన్ సభ్యులు మృతుడు అజయ్ తల్లిదండ్రులు జానకి రాముడు, నాగలక్ష్మికి రూ.20 లక్షల చెక్కును అందజేశారు. వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించేలా చూడాలని కౌకుట్ల చంద్రారెడ్డి భరతమాత ఫౌండేషన్ సభ్యులను కోరారు.

బడ్జెట్‌పై విద్యార్థులకు అవగాహన

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో శనివారం కేంద్ర బడ్జెట్-2025పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కేవలం సంఖ్య కాదని, మన ఆర్థిక వ్యవస్థ మరియు వ్యాపారాల భవిష్యత్తును రూపొందిస్తుందన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రభుత్వం వృద్ధి, ఉద్యోగాలు, డిజిటల్ పరివర్తనలపై దృష్టి సారించిందని తెలిపారు. అనంతరం కళాశాల డైరెక్టర్ మోహన్, ప్రిన్సిపాల్ లోకనాథం బడ్జెట్‌పై అంశాల వారిగా విద్యార్థులకు వివరించి ఎలా ప్రభావితం చేస్తాయో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంబీఏ హెచ్ఓడీ నాగరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకే హ్యాకథాన్

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఘనాపూర్ కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల (కేపీఆర్ఐటీ)లో శనివారం స్మార్ట్ బ్రిడ్జ్ ఆధ్వర్యంలో నాస్‌కామ్ పద్ధతిలో హ్యాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్మార్ట్ బ్రిడ్జ్ ప్రతినిధులు అక్షయ్, శివమ్ మాట్లాడుతూ హ్యాకథాన్‌తో విద్యార్థులకు కొత్త టెక్నాలజీపై అవగాహన కలుగుతుందని, నూతన ఆవిష్కరణలకు వేదికగా నిలుస్తుందన్నారు. ముఖ్యఅతిథులు కేపీఆర్ఐటీ వైస్ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్, డైరెక్టర్ సుధీర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు తరచూ హ్యాకథాన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ రవీంద్ర ఏక్లార్కర్, శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ శ్రీనాథ్ కశ్యప్, స్మార్ట్ బ్రిడ్జ్, నాస్‌కామ్ ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యుత్ సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

ఘట్‌కేసర్: విద్యుత్ సిబ్బందిని దూషించిన హాస్టల్ నిర్వాహకుడిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై నరసింహ తెలిపిన వివరాలు.. పట్టణంలోని బుగ్గబాయి కాలనీ మధుగాని గోపాలకృష్ణ హాస్టల్ నిర్వహిస్తున్నాడు. 15 మీటర్లకు రూ.80 వేలకు పైగా బిల్లు పెండింగ్‌లో ఉంది. విద్యుత్ సిబ్బంది వినోద్‌కుమార్, పవన్, లక్ష్మణ్ వచ్చి బిల్లు చెల్లించాలని కోరడంతో వారిపై దాడికి యత్నించాడు. సిబ్బంది వీడియో తీస్తుండగా ఫోన్ లాక్కొని ధ్వంసం చేశాడు. దీంతో వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహాకుంభమేళాకు వెళ్లే వారిని రోడ్డుపై వదిలేసిన ప్రైవేట్ ట్రావెల్స్

మేడ్చల్‌రూరల్: మహా కుంభమేళాలో పాల్గొనేందుకు ప్రయాగ్‌రాజ్‌కు ప్రైవేట్ ట్రావెల్స్‌లో టికెట్లు బుక్ చేసుకున్న భక్తులకు ప్రైవేట్ ట్రావెల్స్ చుక్కలు చూపించింది. బెంగళూరు, కర్నూల్, హైదరాబాద్‌ల నుంచి ప్రయాగ్‌రాజ్‌కు వెళ్తున్న భక్తులను మార్గమధ్యలో మేడ్చల్‌లో బస్సు నిలిపిన డ్రైవర్ పరారవ్వడంతో ప్రయాణికులు మేడ్చల్‌లోని 44వ జాతీయ రహదారిపై 4 గంటల పాటు నిరీక్షించాల్సి వచ్చింది. వివరాలు.. మహా కుంభమేళాలో పాల్గొనేందుకు బెంగళూరు, కర్నూల్, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన 40 మంది భక్తులు న్యూధనుంజయ ట్రావెల్స్ బస్సును రెడ్‌బస్ యాప్ ద్వారా బుక్ చేసుకున్నారు. బెంగళూరు, కర్నూలుకు చెందిన ప్రయాణికులతో నగరానికి చేరుకున్న బస్సు మెహిదీపట్నంలో బస్ ట్రబుల్ ఇచ్చిందని, ఇతర బస్ ఏర్పాటు చేశారు. దీంతో ఆ బస్సులో వసతులు సరిగ్గా లేవని, తాము స్లీపర్ కోచ్‌కు డబ్బులు చెల్లించి బుక్ చేసుకుంటే తమకు సెమీ స్లీపర్ సీటు ఎలా ఇస్తారని ప్రయాణికులు ప్రశ్నించారు. మరో ఏడుగురికి సీట్లు సైతం లేకపోవడంతో వారంతా డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేయగా మేడ్చల్ వద్ద డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన ఆపేసి వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, రవాణాశాఖ అధికారులు ట్రావెల్స్ యాజమాన్యంతో మాట్లాడగా వారు మరో ఇద్దరు డ్రైవర్లను పంపించడంతో బస్సు బయలుదేరింది.

ఔటర్‌పై జర ఫైలం!

- ఎగ్జిట్‌ల వద్ద ఇసుక లారీల హల్‌చల్
- ఔటర్‌పై ఇష్టానుసారంగా పార్కింగ్
- నిఘా లేకపోవడంతో రెచ్చిపోతున్న వైనం
- అధికారులు స్పందించాలంటున్న వాహనదారులు



శంభీపూర్ ఎగ్జిట్ వద్ద నిలిపిన ఇసుక లారీలు

మేడ్చల్: నగరవాసులకు ఔటర్ రింగు రోడ్డు పేరు చెబితే.. వావ్ అంటారు. ఎలాంటి ట్రాఫిక్ చిక్కులు లేకుండా రయ్యిరయ్యిమంటూ హాయిగా సాగిపోతుంటారు. ఔటర్‌పై ఎక్కడి నుంచి ఎంట్రీ అయినా ఎగ్జిట్ వరకు వెళ్తుంటే తాము మహా నగరంలోనే ఉన్నామా అనే రీతిలో ట్రాఫిక్ అవస్థలు లేకుండా తమ గమ్యస్థానాల వైపు వెళ్తుంటారు. అయితే మేడ్చల్ ఎగ్జిట్ వద్ద మాత్రం ఔటర్ నుంచి కిందకు దిగే వాహనదారులకు నరకం కనిపిస్తోంది. అప్పటి వరకు ప్రశాంతంగా సాగిన వారి ప్రయాణం కిందకు దిగితే చాలు.. ఇసుక లారీలు, ఇతర బిల్డింగ్ మెటీరియల్ సప్లయ్ చేసే లారీలు భయాందోళనకు గురిచేస్తాయి. దానికి తోడు అవుటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డుతో పాటు ఎగ్జిట్ మార్గంలో ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్‌తో మరిన్ని అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికే ఎన్నో ప్రమాదాలు జరిగినా ఎవరూ పట్టించుకోవడం లేదు. నగరం చుట్టూ ఉన్న 158 కిలో మీటర్ల మేర ఔటర్ రింగు రోడ్డుపై అత్యవసర ప్రాంతాలు మినహా ఎక్కడా వాహనాలు నిలపరాదు. వాహనాలు మరమ్మతులకు గురైనప్పుడు, ఇతర సమస్యలు వస్తే ఔటర్ రింగు రోడ్డుపై వాహనాలను నిలపకుండా ఏర్పాట్లు చేసుకోవాలి. కానీ నిబంధనలు పట్టించుకోకుండా రాత్రి వేళలో రోడ్డుపైనే వాహనాలను నిలుపుతున్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మేడ్చల్ జాతీయ రహదారిపై నుంచి అధికంగా ఇసుక లారీలు నగరానికి రాకపోకలు సాగిస్తుంటాయి. నగరంలో రాత్రి 11 గంటల సమయంలో మాత్రమే ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు అనుమతి ఉండటంతో ఈ సమయంలో ఇసుక వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇదే సమయంలో ఇసుకను అన్‌లోడ్ చేసేందుకు నగరానికి పెద్దఎత్తున లారీలు వెళ్తుంటాయి.

అడ్డగోలుగా పార్కింగ్‌లు..

రింగు రోడ్డుపై ప్రధానంగా దుండిగల్, శంభీపూర్, సుల్తాన్‌పూర్, పటాన్‌చెరువు తదితర ఎగ్జిట్‌ల వద్ద రాత్రి సమయాల్లో లారీల అక్రమ పార్కింగ్ ఎక్కువగా ఉంది. 20 నుంచి 30 లారీల వరకు నిత్యం రింగురోడ్డుపైనే ఎగ్జిట్‌ల వద్ద ఒకదాని వెనుక ఒకటి పార్క్ చేస్తూ సిటీలోకి ఎంట్రీ సమయం రాగానే కిందకు దిగి అన్‌లోడ్ చేసే ప్రాంతాలకు వెళ్తున్నాయి. రాత్రి సమయాల్లో గస్తీ తక్కువ కావడం, పట్టించుకునే వారు లేకపోవడంతో గంటల తరబడి పార్క్ చేస్తూ అందరినీ ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

మందుబాబుల హల్‌చల్..

కొంతమంది మందుబాబులు ఔటర్ రింగ్ రోడ్డుపై మద్యం తాగి వాహనాలను నడుపుతున్నారు. రెండు మూడు కార్లలో 10 నుంచి 15 మంది మద్యం తాగుతూ రింగు రోడ్డుపై హల్‌చల్ చేస్తున్నారు. వీరిని అదుపు చేసేవారు లేరు. దీంతో మరింత రెచ్చిపోతున్నారు. భారీ ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం

జవహర్‌నగర్: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్ర కారం.. బాలాజీనగర్ జ్యోతినగర్‌కు చెందిన పరుశురామ్(35) నిరుద్యోగి. గత నెల 29న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భార్య పూజిత పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మరో ఘటనలో..

కాప్రా బీజేఆర్‌నగర్‌కి చెందిన జానిపల్లి రాజేష్(38) ప్రైవేట్ ఉద్యోగి. గత నెల 30వ తేదీన తన పని పూర్తి చేసుకుని సాయంత్రం ఇంటికి వచ్చాడు. ఆ తర్వాత పెట్రోల్ కోసం తన ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కీసర ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాస్

కీసర: కీసర పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా కస్తూరాజు శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. మహేశ్వరం ఎస్‌ఓటీలో పనిచేసిన ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చిన విషయం విధితమే. నూతన ఇన్‌స్పెక్టర్‌ను ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బెలిదే రమేష్‌గుప్తా, కీసర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోల కృష్ణాయాదవ్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. బదిలీపై వెళ్లిన ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటయ్యను నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డితో పాటు పలువురు నాయకులు సత్కరించారు.

శానిటరీ ప్యాడ్ దహన యంత్రం అందజేత

అల్వాల్: పర్యావరణ పరిరక్షణకు హైదరాబాద్ యూత్ అసెంబ్లీ సంస్థ కృషి చేస్తుందని సంస్థ నిర్వాహకులు అన్నారు. శనివారం అల్వాల్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సంస్థ ఆధ్వర్యంలో శానిటరీ ప్యాడ్ దహనయంత్రాన్ని అందజేశారు. శానిటరీ ప్యాడ్స్‌ను మిషన్లలో వేయాలన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై నగరవాసుల భిన్న స్వరాలు

కాప్రా/అల్వాల్ /మౌలాలి: లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై పలువురి నుంచి బిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఎనిమిదోసారి ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులను మెప్పించేలా ఉందంటే.. మరికొందరు విద్యార్థులను నిరాశపర్చిందని మరికొందరు అభిప్రాయ పడుతున్నారు.

దేశమంటే కొన్ని రాష్ట్రాలే అన్నట్లు బడ్జెట్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-2026 బడ్జెట్ చాలా నిరాశపరిచింది. కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ చెబుతూ తెలంగాణ రాష్ట్రంపై వివక్ష చూపుతోంది. తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్రమంత్రులు, బీజేపీ ఎంపీలు ఉండి కూడా ఏం సాధించారోనని ఆలోచించుకోవాలి.

– మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

ఇది నిజంగా పేదల బడ్జెట్

దేశంలో ఎక్కువ శాతం ఉన్న మధ్యతరగతి వాళ్లకి ఇది నిజంగా శుభవార్త. రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను లేకపోవడం మధ్యతరగతి ప్రాధాన్యతను గుర్తించారు. యువతకు ఉద్యోగ కల్పన, సంక్షేమ పథకాల కోసం బడ్జెట్ కేటాయింపులు అన్ని వర్గాల అభివృద్ధికి తోడ్పడుతుంది.

– గున్నాల సునీతా శేఖర్ యాదవ్, మౌలాలి కార్పొరేటర్

ఉద్యోగులకు వరం లాంటిదే..

బడ్జెట్ ఉద్యోగులకు ఓ గొప్ప వరం లాంటిది. ఆదాయపన్నుల స్లాబ్ రూ.12 లక్షల వరకు ట్యాక్స్ లేకపోవడంతో మధ్యతరగతికి మేలు చేసింది. 36 రకాల ఔషధాలకు పన్ను విధించకుండా అందించాలనే నిర్ణయం చాలా మంచిది.

– రాజేశ్వర్‌గుప్తా, సామాజికవేత్త